క్లుప్తంగా

పేదలకు సామగ్రి వితరణ



పేదలకు వస్తువులు అందజేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: పాత సామగ్రి, దుస్తులు, పుస్తకాలు తదితర వస్తువులను నగరపాలకసంస్థ నిర్వహిస్తున్న రెడ్యూజ్ రీసైకిల్ రీయూజ్ (ఆర్ ఆర్ ఆర్) సెంటర్లకు అందించాలని నగర ప్రజలకు కమిషనర్ కె.దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ సెంటర్ల ద్వారా సేకరించి శుభ్రపరిచిన దుస్తులు, ఇతర సామగ్రిని శనివారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సత్యవేణి, ఏసీ పాండురంగా రావు, ఎంహెచ్ఓ డాక్టర్ వినూత్న, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దీక్షా శిబిరం సందర్శన

కంబాలచెరువు: స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరాన్ని శనివారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.రవిబాబు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షులు గోపి అప్పారావు, కోశాధికారి ఎస్.తేజ విజయ్ కుమార్ మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరాటానికి సంఘీభావంగా యూటీఎఫ్ నగర శాఖ రాజమహేంద్రవరం తరఫున రూ.35 వేలు విరాళంగా అందించారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎస్‌కేవీటీ విద్యార్థులు

ప్రకాశం నగర్: చెన్నైలోని ఎస్ఆర్ఎం ఐఎస్‌టీలో సోమవారం నుంచి ఈ నెల 30 వరకూ జరిగే సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీలకు ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎంఎల్.శ్రీనివాస్, కె.సతీష్, ఈ.మణికంఠ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎబల్ రాజబాబు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధి గోపన్నపాలెంలోని ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో జరిగిన సెలక్షన్స్ అండ్ ట్రైల్స్‌లో ఎస్‌కేవీటీ కళాశాల జట్టు నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. తమ ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికవ్వడం గర్వకారణమన్నారు. వారిని స్పోర్ట్స్ విభాగాధిపతి పీఏ కిషోర్ బాబు, డీవీ రమణమూర్తి, గాలి వెంకటరమణ, పీవీటీ సంజీవ రావు అభినందించారు.

సచివాలయం సిబ్బందికి సన్మానం



సచివాలయ సిబ్బందిని సత్కరించిన బ్రహ్మకుమారీలు

రాజమహేంద్రవరం సిటీ: కరోనా సమయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేసిన సేవలు అద్భుతమని రాజయోగ శిక్షణా కేంద్రం నిర్వాహకురాలు బీకే సత్యవాణి ప్రశంసించారు. శనివారం స్థానిక ఆనాల వెంకట అప్పారావు రోడ్డు బాబా నగర్ ఆరో వీధిలోని రాజయోగ శిక్షణ కేంద్రంలో నారాయణపురం సచివాలయం సిబ్బంది, వలంటీర్లను సత్కరించారు. వారికి సర్టిఫికెట్లు, పతకాలు బహూకరించారు. ఈ సందర్భంగా సచివాలయం అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ కుమార్ రాజా మాట్లాడుతూ తాము చేసి సేవలను గుర్తించి బ్రహ్మకుమారి సంస్థ సన్మానించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.

ధర్మమే అత్యున్నతం



సామవేదం షణ్ముఖ శర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నాలుగు పురుషార్థాలలో ధర్మం అత్యున్నతమైనదని శ్రీరాముడు తన తల్లి కౌసల్య, తమ్ముడు లక్ష్మణులకు చెబుతాడని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. శనివారం హిందూ సమాజంలో ఆయన పదకొండవ రోజు ప్రవచనం నిర్వహించారు. రాముని వనవాస దీక్ష గురించి విన్న లక్ష్మణుడు, తల్లి కౌసల్య తీవ్ర ఆవేదనకు గురయ్యారన్నారు. ఆ సమయంలో రామచంద్రమూర్తి మాట్లాడుతూ అర్థ, కామాల కోసం ధర్మాన్ని వదల రాదని, ధర్మం కోసం అర్థ కామాలను పరిత్యజించవచ్చునని చెబుతాడు. నేను అడవులకు వెళ్లక పోతే రాజ్యం ఉంటుంది, కానీ ధర్మం ఉండదు, పరిమితం అయిన జీవితంలో శాశ్వత ఫలాన్ని ఇచ్చేది ధర్మమేనని రాముడు వివరిస్తారన్నారు. తండ్రి మాట విన్నవాడు ఎన్నటికీ పతనం కాడని, తండ్రికి అసత్య దోషం రాకుండా చూడాలన్నదే రాముని లక్ష్యమని సామవేదం తెలిపారు.



గోవింద క్షేత్రంలో పద్మావతి, గోదాదేవీ సమేత వేంకటేశ్వరస్వామి



ఇస్కాన్‌లో గీతా పారాయణ చేస్తున్న భక్తులు



దుళ్ల వేంకటేశ్వరాలయంలో భక్తుల రద్దీ



గాడాలలో వేంకటేశ్వరస్వామి



కంబాల చెరువు వేంకటేశ్వర స్వామి మఠంలో..

ముక్కోటి శోభ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

- ఘనంగా వైకుంఠ ఏకాదశి పర్వదినం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఉత్తర ద్వారంలో స్వామివార్ల దర్శనం
- పోటెత్తిన భక్తులు

సీటీఆర్ఐ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాలు భక్తులతో శనివారం కిటకిటలాడాయి. స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి భక్తులు దర్శించుకున్నారు. ప్రాతఃకాల ఆరాధన అనంతరం వైకుంఠ ఏకాదశిని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే గీతా జయంతి సందర్భంగా ఇస్కాన్ తదితర దేవాలయాలలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు జరిపారు. గీతా జయంతిని పురస్కరించుకుని ఎంపీ భరత్ రామ్ స్థానిక గోపాలనగర్ పుంతలోని శ్రీకృష్ణ దేవాలయంలో పూజలు చేశారు. అలాగే దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో కోలాట నృత్యాలు, పవిత్ర జల కలశాలతో వందల మంది మహిళలు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీ భరత్ రామ్, మోనా దంపతులు ప్రారంభించారు.

వివిధ ఆలయాల సందర్శన

అంతకు ముందు ఎంపీ భరత్ రామ్, మోనా దంపతులు వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా నగరంలోని పలు దేవాలయాలను సందర్శించారు. ఆర్యాపురం వేణుగోపాలస్వామి, దేవీచౌక్‌లోని దశావతార రామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. ఆనం కళా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి, గోదావరి గట్టున వేణుగోపాల స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పోలు విజయలక్ష్మి, ఎన్వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

- లాలాచెరువులోని గోవింద క్షేత్రం, దేవీచౌక్ మఠం వీధిలోని వేంకటేశ్వర ఆలయం, సీతంపేట రామాలయం, నల్లమందు సందులోని వేంకటేశ్వర స్వామి ఆలయం, గోదావరి గట్టున వేణుగోపాలస్వామి క్షేత్రం, ఇస్కాన్ టెంపుల్, వంకాయలవారి వీధిలోని అష్టలక్ష్మి ఆలయం, శ్రీరంగనాథ ఆలయాలకు భక్తులు తరలివచ్చి, ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు.
- గాడాలలోని మహాలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి పీఠంలో శనివారం ద్వితీయ ముఖ వేంకటేశ్వరస్వామికి శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆలయంలోని వ్యూహాలక్ష్మికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, వ్యూహలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ, సహస్రనామ పూజ నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. రాజమహేంద్రవరం క్షేత్ర పాలకుడు శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారికి కల్యాణం నిర్వహించారు.
- కోరుకొండ రోడ్డు సింహాచలనగర్‌లోని వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. స్వామివారు బంగారు కవచంతో దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, కాలెపు నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఎ.కిరణ్ స్వామి పూజాదికాలు నిర్వహించారు.
- సీతంపేటలోని పురాతన రామాలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకం జరిపారు.

కడియం మండలంలో..

కడియం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. దుళ్లలోని భూసమేత వేంకటేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి, కడియం జనార్దన స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ ఏర్పడింది.

కన్నుల పండువగా..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వేంకటేశ్వరనగర్‌లోని భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచే భక్తులు ఉత్త రద్వార (వైకుంఠ ద్వారం) దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు అంగర వల్లీకాంతాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి మేళతాళాలతో స్వామివారి ఊరేగింపు ఆలయం నుంచి బయలుదేరి రామకృష్ణానగర్, నవభారత్‌నగర్, రాఘవేంద్ర నగర్ మీదుగా ఆలయానికి చేరుకుంది.

- బొమ్మూరు వెంకటగిరికొండపై గల లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు పాల్గొని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్త కామిని ప్రసాద చౌదరి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు నందూరి శ్రీకృష్ణపరమాత్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బొమ్మూరు వేంకటేశ్వర నగర్‌లోని స్వామివారు

సీఎం జగన్‌కు అన్ని వర్గాల ఆదరణ



రాజవోలులో పార్టీ పతాకాన్ని ఎగురవేస్తున్న విష్ణుమూర్తి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ఆదరణ లభిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్ అన్నారు. రాజవోలు గ్రామ సచివాలయం–1లో శనివారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి, పెయ్యల రాజేష్, మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, మానమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ముందుగా గ్రామ కూడలిలో పార్టీ పతాకాన్ని తాటికొండ విష్ణుమూర్తి ఎగురవేశారు. పెయ్యల రాజేష్, తాటికొండ విష్ణుమూర్తి మాట్లాడుతూ రాజవోలు గ్రామ సచివాలయం–1 పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధిదారులకు రూ.14.87 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.1.43 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.కాశీవిశ్వనాథ్, సచివాలయ కన్వీనర్లు బూసి రామకృష్ణ, సింహాద్రి రామలక్ష్మి, జుత్తుక వసంత్, సంగిశెట్టి సత్యనారాయణ, సోడదాసి కేతన, కాకరపర్తి కన్నబాబు, చిటికిన శ్రీనివాస్, నిశ్చనకోళ్ల తాతారావు, వనజాక్షి, కళ్యాణి, కొమారపు నవీన్, జుత్తుక గంగరాజు, చౌదరి, బత్తిన గోవిందు, గుత్తుల కళ్యాణ్‌రామ్ పాల్గొన్నారు.

చట్టాలపై కచ్చితమైన అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులకు జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్ 2015, మానవ అక్రమ రవాణా, ప్రీఅరెస్ట్, అరెస్ట్, రిమాండ్ దశలలో న్యాయ సేవలు తదితర అంశాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015పై పోలీసు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. చట్టంతో విభేదించిన పిల్లలతో సదరు అధికారుల వ్యవహార శైలి సాధారణ కేసులలోని నిబంధనలకు భిన్నంగా ఉంటాయన్నారు. వారితో స్నేహపూర్వకంగా, సున్నితంగా వ్యవహరించాలని, ఈ చట్టంలోని నిబంధనలని కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ జువెనైల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం సదరు అధికారులు పాటించాల్సిన నిబంధనలు, నిషిద్ధమైన చర్యలను వివరించారు. ఒకటో అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.జగదీశ్వరి మాట్లాడుతూ ప్రీ అరెస్ట్, అరెస్ట్, రిమాండ్ దశలలో న్యాయసేవలను వివరించారు. 6వ అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.రెడ్డి ప్రసన్న మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలనలో పోలీసులు, ఇతర అధికారుల పాత్రను, అక్రమ రవాణా బాధితులకు నల్సా న్యాయ సేవల పథకాలను వివరించారు. అనంతరం న్యాయమూర్తి గంధం సునీత, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పీఆర్ రాజీవ్‌లు అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ సోమశేఖర్, సౌత్ జోన్ డీఎస్పీ శ్రీనివాసులు, కొత్తపేట డీఎస్పీ కె.రమణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.ధర్మారావు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ పి.సూర్యప్రభావతి, జువెనైల్ జస్టిస్ బోర్డ్ సభ్యురాలు తబిత, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తాపీ కార్మికుడి మృతి

కడియం: మండలంలోని కడియపుసావరం గ్రామంలో విద్యుదాఘాతంతో తాపీ కార్మికుడు కన్నుమూశాడు. కడియం పోలీస్‌లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుళ్ల గ్రామానికి చెందిన పిచ్చుక వీరనాగ వరప్రసాద్ (29) కడియపుసావరం వైఎస్సార్ కాలనీలోని ఎస్.స్వామికి చెందిన ఇంటి వద్ద పని చేస్తున్నాడు. శనివారం ఉదయం పిట్టగోడ కట్టే క్రమంగా రాడ్డును బెండ్ చేస్తున్నాడు. దీంతో సమీపంలోనే ఉన్న విద్యుత్ తీగలకు ఆ రాడ్డు తగిలి విద్యుత్ సరఫరా జరిగింది. ఆ రాడ్డు పట్టుకున్న వీరనాగ వరప్రసాద్, మరో కార్మికుడు సప్పా వెంకట రమణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరినీ కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి వీర నాగప్రసాద్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకట రమణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ సుజాత

కడియం: ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ ఎం.సుజాత అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక హైస్కూల్లో శనివారం మండల స్థాయిలో వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ నాణ్యమైన సరుకులు అమ్మకపోతే న్యాయబద్ధంగా పోరాడే హక్కు ఉందన్నారు. తద్వారా నష్టపరిహారం పొందవచ్చన్నారు. హైస్కూల్ హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఐ కేఎస్ ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. వ్యాసరచనలో విజయలక్ష్మి, వక్తృత్వంలో హేమ, డ్రాయింగ్‌లో హర్షిణి బహుమతులు పొందారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సువర్ణవేణి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన టీడీపీకే సాధ్యం

సీటీఆర్ఐ: ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగించడం ఒక్క టీడీపీకే సాధ్యమవుతుందని మాజీ మంత్రి, టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అధ్యక్షుడు కేఎస్ జవహర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతమైందన్నారు. ఆయన పాదయాత్రలో అన్ని వర్గాలను కలుసుకుని సమస్యలను తెలుసుకున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్యాచరణ చేయడానికి సిద్ధం చేశారన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్



క్రీస్తు జననం నాటికను ప్రదర్శిస్తున్న డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో క్రిస్మస్ వేడుకలు జరిపించడం ఇదే మొదటిసారని, ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని సిబ్బందిని కోరారు. అనంతరం అధికారులందరూ కేక్ కట్ చేశారు.

ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్లో..

ధవళేశ్వరం: డ్రీమ్స్ స్కూల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు అలరించాయి. క్రీస్తు జననం నాటికను విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. క్రిస్మస్ తాత విద్యార్థుల మధ్య సందడి చేశారు. విద్యార్థులు వివిధ భక్తి గీతాలతో అలరించారు. డ్రీమ్స్ విద్యాసంస్థల చైర్మన్ అంగర రమేష్ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్రిస్మస్ విశిష్టతను విద్యార్థులకు వివరించేందుకు వేడుకలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాళ్లు జి.విమలారోజీ, వి.సంధ్య కుమారి, ఎన్.దీపిక, కె.లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయండి



బొమ్మూరులో 3కే రన్‌లో పాల్గొన్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కేఎస్ జ్యోతి అన్నారు. బొమ్మూరు జాతీయ రహదారి నుంచి పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు శనివారం మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు నిర్వహించిన 3 కే రన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎస్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 3కె రన్ నిర్వహించామన్నారు. మండలంలోని 35 గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడాపోటీలు నిర్వహించిన అనంతరం మండల పోటీలు జరుగుతాయన్నారు. ఈ 3కె రన్ బొమ్మూరు సెంటర్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకుంది. అక్కడ అధికారులు కొద్దిసేపు యోగా నిర్వహించి, అనంతరం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పైడి చిన్నారావు, ఈవోపీఆర్అండ్ఆర్డీ తాడి కృష్ణ, మండల క్రీడాభివృద్ధి అధికారి ఇబ్రహీం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు రాజమహేంద్రవరంలో త్రీ కే రన్



చౌటుపల్లి వీరన్న

కొవ్వూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు రాజమహేంద్రవరంలో త్రీ కే రన్ నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న తెలిపారు. మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఈ త్రీకే రన్ ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమానికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, యువజన విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌లు హాజరవుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యవర్గ సభ్యులు, మండల, నియోజకవర్గ స్థాయిలో ఉన్న యువ జన విభాగాల నాయకులు భాగస్వాములు కావాలని వీరన్న కోరారు.

హైవే జంక్షన్.. ప్రమాదాల టెన్షన్



అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టిన మోటారు సైకిల్



రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనాలు



కడియపులంక జంక్షన్‌లో బోల్తా కొట్టిన ఇటుక లోడు ట్రాక్టర్

- కడియపులంక వద్ద హైవేపై తరచూ ఘటనలు
- ఆందోళనలో ప్రయాణికులు

కడియం: మండల పరిధిలోని కడియపులంక వద్ద జాతీయ రహదారి జంక్షన్ ప్రమాదకరంగా మారింది. అటు జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు, ఇటు పువ్వుల మార్కెట్‌కు వచ్చి వెళ్లే వాహనాలతో ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. జంక్షన్ రద్దీకి తోడు రావులపాలెం నుంచి వేమగిరి వైపునకు వచ్చే రోడ్డులో జాతీయ రహదారి మలుపు కూడా ఈ కూడలి సమీపంలోనే ఉంది. హైవేపై వచ్చే వాహనాలు ఈ మలుపు దాటిన వెంటనే జంక్షన్ ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో వాహనాన్ని కంట్రోల్ చేసేలోపు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

రాంగ్ రూట్‌లో వాహనాలు

జంక్షన్ సమీపంలోనే లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ నిత్యం పలు వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. రాంగ్ రూట్‌లో కూడా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అనధికారిక పార్కింగ్, రాంగ్ రూట్ ప్రయాణాల కారణంగా ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. వాహనదారుల నిర్లక్ష్యంతో పాటు, రోడ్డు భౌగోళిక పరిస్థితులు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇక్కడ సర్వీస్ రోడ్డు నిర్మించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ నిత్యం జరిగే ప్రమాదాల్లో పోలీస్‌ల దృష్టికి వచ్చేవి కూడా అతి తక్కువగానే ఉంటున్నాయి.

పలు ప్రమాదాలు

- ఇటీవల ఇటుకల లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఈ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైనే బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ఎవ్వరికీ ఏమీ కాలేదు. సంబంధిత వాహన యజమానులు వేరే ట్రాక్టరుపై ఇటుకలు లోడు చేసుకుని వెళ్లిపోయారు.
- ఇటీవలే ముగ్గురు యువకులు మోటారు సైకిల్‌పై వస్తుండగా, గుర్తు తెలియని వాహనం వేగంగా వారిని దాటుకుంటూ వెళ్లిపోయింది. దీంతో మోటారు సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.
- ఈ జంక్షన్‌ను దాటి రావులపాలెం వైపునకు మోటారు సైకిల్‌పై ఇద్దరు యువకులు వస్తున్నారు. రోడ్డు మార్జిన్‌ను సరిగ్గా అంచనా వేయలేకపోరు. దీంతో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న వ్యాన్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడగా, మోటారు సైకిల్ నుజ్జునుజ్జయ్యింది.

ప్రతి రోజూ ప్రమాదాలు

కడియపులంక జంక్షన్‌లో నిత్యం చిన్నదో, పెద్దదో ప్రమాదం జరుగుతోంది. కొన్నిసార్లు వాహన చోదకుల ప్రాణాలు పోతున్న ఘటనలు కూడా ఉంటున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లోని రద్దీ సమయాల్లో జంక్షన్ దాటాలంటే భయమేస్తోంది. ప్రమాదాలు జరక్కుండా చర్యలు తీసుకోవాలి.

– ఎన్‌వీవీ సత్యనారాయణ, కడియపులంక